క్లుప్తంగా

నేడు గృహసారథులకు శిక్షణ

అచ్చంపేట: స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో మంగళవారం గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ సమావేశం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరై దిశా నిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 10గంటల వరకు అచ్చంపేట 1, 2 సచివాలయాలు, 10 నుంచి 11 గంటల వరకు చింతపల్లి, పుట్లగూడెం, చెరుకుంపాలెం, తాళ్లచెరువు, 11 గంటల నుంచి 12 గంటల వరకు చిగురుపాడు, రోకటిగుంట వారిపాలెం, కోగంటి వారిపాలెం, అంబడిపూడి, కోనూరు, కస్తల గ్రామాల వారికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3గంటల వరకు ఓర్వకల్లు, రుద్రవరం, గ్రంథశిరి, వేల్పూరు గ్రామాల వారికి, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు పెదపాలెం, మిట్టపాలెం, కొండూరు గ్రామాల వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన తెలిపారు.

గడప గడపకు...

సాయంత్రం 5 గంటల నుంచి క్రోసూరు సచివాలయం 1 పరిధిలో మూడవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని జడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

బీమా నగదు అందజేత

అచ్చంపేట: పాడి రైతు మరణించడంతో సంగం డెయిరీ అతని కుటుంబానికి రూ.60వేల బీమా నగదు సోమవారం అందజేసింది. పెదపాలెం పాల ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి చిరుమామిళ్ల నరసింహారావు మాట్లాడుతూ.. మూడు, నాలుగేళ్లుగా పెదపాలెం రైతు పాటిబండ్ల శివరామయ్య పాలు పోస్తున్నట్లు చెప్పారు. ఆయన ఇటీవల మృతి చెందగా బీమా నగదు వర్తించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేనేజరు టి.గోపీ, అధ్యక్షులు వెంకటనారాయణ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం రేపు

క్రోసూరు: క్రోసూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న బుధవారం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షతన వివిధ శాఖల పనితీరుపై సమీక్షనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

బల్లలు, కుర్చీలు బహూకరణ



బాలెమర్రు(క్రోసూరు): మండలంలోని బాలమర్రు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ముసులూరి నాగేశ్వరరావు 12 బల్లలు, రెండు కుర్చీలు, రెండు టేబుళ్లు బహూకరించారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం తూమాటి శరత్‌కుమార్‌కు వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి, క్రోసూరు, పెదకూరపాడు ఎంఈఓలు వై.వెంకటేశ్వరరావు, జి.యేసురత్నం, ఏకుల ప్రసాదరావు పాల్గొని, దాతను అభినందించారు. అందుకూరు ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం ఎం.కృష్ణంరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయాలి

ముప్పాళ్ళ: వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా అన్ని గ్రామాల్లోనూ భూముల రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే ప్రక్రియపై సోమవారం సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. సర్వే మార్గదర్శకాలను వివరించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ ఏడుకొండలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా కపోతేశ్వరస్వామి తిరునాళ్ల



నకరికల్లు: చేజర్లలోని కపోతేశ్వరస్వామి తిరునాళ్ల సోమవారం కన్నులపండుగగా జరిగింది. అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్యశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి తిరునాళ్ల మహోత్సవం జరిపించారు. ముందుగా సుప్రభాతసేవ, మేలుకొలుపు, రుద్రహోమం, బలిహరణ, గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామిని నాలుగు వాహనాలపై ఊరేగించారు. విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

ఉపాధిలో పారదర్శకతకు 'ఆధార్'

- జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం వేగవంతం
- సత్తెనపల్లి క్లస్టర్ పరిధిలో 1,30,087 మంది కూలీలు నమోదు
- 95 శాతం అనుసంధానం పూర్తి



ధూళ్ళిపాళ్లలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల జాబ్ కార్డులతో ఆధార్ అనుసంధానాన్ని సత్తెనపల్లి క్లస్టర్ అధికారులతోపాటు మండలాల్లోని సిబ్బంది వేగవంతం చేశారు. ఫలితంగా పనుల కల్పన, వేతనాల చెల్లింపులు, ఇతర అంశాల్లో పారదర్శకత రానుంది. గతంలో ఒకరికి రెండు జాబు కార్డులు ఉన్న ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. వివాహాలు, ఇతర ప్రాంతాలకు వలసపోయిన సందర్భాలు, మరుగుదొడ్లు, ఇంటి నిర్మాణాలు, పనుల కల్పనకు సంబంధించి రెండో జాబు కార్డు పొందిన ఘటనలు అనేకం ఉన్నాయి. జాబ్‌కార్డుల మంజూరులో తనిఖీలు లేక అదనపు కార్డుల సంఖ్య పెరిగింది. సాంకేతిక సమస్యల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సత్తెనపల్లి క్లస్టర్ పరిధిలో ఉపాధి హామీ వివరాలివీ..

మండలం	పంచాయతీలు	జాబ్ కార్డులు	నమోదైన కూలీలు
సత్తెనపల్లి	25	11,507	20,458
ముప్పాళ్ళ	14	6,879	12,404
రాజుపాలెం	18	8,867	16,325
నకరికల్లు	17	10,086	16,402
పెదకూరపాడు	20	7,710	13,930
అమరావతి	20	5,902	10,275
అచ్చంపేట	22	7,970	13,754
క్రోసూరు	18	8,129	14,103
బెల్లంకొండ	12	6,499	12,436
మొత్తం	166	73,549	1,30,087

అక్రమాలకు అడ్డుకట్ట కోసమే..

సత్తెనపల్లి క్లస్టర్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో 166 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 73,549 జాబ్ కార్డులు ఉండగా మొత్తం 1,30,087 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఇప్పటి వరకు సుమారు 95 శాతం ఆధార్ అనుసంధానం పూర్తయింది. గతంలో ఓ కుటుంబంలో తండ్రి, కుమారులు, సోదరులకు ఒక జాబ్ కార్డు ఉండేది. కుమారుడికి వివాహమైతే వేరే జాబ్ కార్డు పొందేవారు. కుమార్తెకు వివాహమై వేరే ప్రాంతానికి వెళ్లి మరో జాబ్ కార్డులో చేరేవారు. పాత కార్డులో వీరు పేర్లు మాత్రం తొలగింపు జరగట్లేదు. ఈ క్రమంలో వేతనాల చెల్లింపు, సాంకేతిక సమస్యలతోపాటు పథకాలు దుర్వినియోగమవుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఆధార్ అనుసంధానం ద్వారా అక్రమాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయవచ్చని కేంద్ర ప్రభుత్వం భావించింది. దీని ద్వారా ఒకటి కంటే ఎక్కువ కార్డుల్లో పేర్లు ఉంటే వాటిని తొలగించనున్నారు.

యాప్‌లో నమోదు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన మార్గదర్శకాల ప్రకారం ఒక కూలీకి పని కల్పించాలంటే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్(ఎన్‌ఎంఎంఎస్) నమోదు తప్పనిసరి. గతంలో 20 మందికి పైగా కూలీలకు పని కావాలంటే మాత్రమే ఎన్‌ఎంఎంఎస్‌లో నమోదు చేసేవారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికారు. పనుల పర్యవేక్షణ, కల్పన, హాజరులో పారదర్శకత పెరుగుతుందని అధికారుల భావన. పనికి వచ్చిన వేతన దారుల సంఖ్య, పనిచేస్తున్న సమయం, తదితర అంశాల్లో అక్రమాల నిరోధానికి యాప్ దోహదపడుతుంది.

ప్రక్రియ వేగవంతం చేశాం



ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ వేగవంతం చేశాం. ఈ ప్రక్రియ సత్తెనపల్లి మండలంలో త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా పనుల కల్పనలో, అంచనాలు, వేతనాలు చెల్లింపుల్లో ఇబ్బందులు అధిగమించేందుకు ఇది దోహదపడుతుంది.

– పి.వెంకటనారాయణ, ఏపీఓ, సత్తెనపల్లి

గృహసారథులే కీలకం

- ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్నీ పలకరించండి
- చంద్రబాబు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



శిక్షణలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

సత్తెనపల్లి: గృహసారథులే జగనన్న రథసారథులని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సత్తెనపల్లి మండలం నందిగామలో సోమవారం జరిగిన నందిగం, గుడిపూడి, కంటేపూడి, కొమెరపూడి, కట్టవారిపాలెం గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమష్టిగా చిత్తశుద్ధితో పనిచేస్తే అధికారం మళ్లీ మనదేనని, కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ గుర్తింపు, న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు, పార్టీ పరిపుష్టికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇళ్ల ముంగిటకే సంక్షేమ ఫలాలు వచ్చాయని చెప్పారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు ఆగలేదని మంత్రి గుర్తుచేశారు. కులాలు, మతాలు, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించాలన్నారు. స్టిక్కర్లు అంటించి ఫొటోలు, వీడియోలు తీసి మీకు ఇచ్చిన ప్రశ్నావళి ప్రకారం సమాధానాలు రాబట్టాలని సూచించారు. గతానికి ఇప్పటికి ఉన్న వ్యత్యాసాలను వివరించాలన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఎల్లో మీడియా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ చిలుక జయపాల్, ధూళ్ళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివనారాయణ, ఎంపీటీసీలు రెంటపాళ్ళ ప్రియదర్శిని, షేక్ షీమా, ఏఎంసీ డైరెక్టర్ ఆళ్ళ జగన్నాథం, గుడిపూడి సర్పంచ్ ఉటుకూరి నాగేశ్వరరావు, నాయకులు కొల్లా నరేష్, యర్రం శ్రీను, నన్నపనేని వాసు, బుజ్జి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయండి

గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే నంబూరు



గృహసారథుల శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దిశానిర్దేశం చేశారు. సోమవారం పెదకూరపాడులోని షాదీఖానాలో గృహసారథుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే శంకరరావు కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. 'ప్రజా సంక్షేమం మన అజెండా అయితే.. మన గెలుపు ప్రజల అజెండా అవుతుంది' అని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను తెలియజేయడంతో పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ పెదకూరపాడులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని సూచించారు. మార్చి 18వ తేదీ నుంచి వలంటీర్లు, గృహ సారథులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరిచేత 'మా నమ్మకం నువ్వే జగన్' అనేలా కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో మూడున్నరేళ్లుగా జరిగిన అభివృద్ధిని అంకెలతో సహా ప్రతి ఒక్కరికీ వివరించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్ ఎంపీపీలు షేక్ చాంద్‌బాషా, మరియరాణి, మండల సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్, వైఎస్సార్ సీపీ నేతలు బి.హనుమంతరావు, బత్తుల కోటేశ్వరరావు, మైనేని నరేంద్ర, మహిళా నేత అల్లం చిన్నమ్మతో, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఏఎంసీ డైరెక్టర్లు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీతో రైతులకు మేలు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ దేవదాసు

నకరికల్లు: రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంటలకు ఈ-కేవైసీ చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమా ద్వారా న్యాయం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.దిలీప్‌కుమార్, జి.జగదీష్, ఎం.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

మెరిట్ టెస్టులో ఫణిదం విద్యార్థిని ప్రతిభ



దీప్తిశ్రీకి మిఠాయిలు తినిపిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, తదితరులు

సత్తెనపల్లి: ఏపీ ప్రభుత్వం నిర్వహించిన ఎడ్యుకేషన్ ఈపీ ఫణి మెరిట్ టెస్ట్–2023 ఫలితాల్లో సత్తెనపల్లి మండలం ఫణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థిని నిమ్మగడ్డ దీప్తిశ్రీ 58 మార్కులతో జిల్లా స్థాయి ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో దీప్తిశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. పదో తరగతి పరీక్షల్లోనూ మంచి ర్యాంకు సాధించాలని ఆకాంక్షించి ఆశీర్వదించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రతాప శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోటివారికి సహాయ పడాలి

మాచర్ల రూరల్: శాంతి, సమానత్వంతో జీవిస్తూ తోటి వారికి సహాయపడినప్పుడే దేవుని కృపకు పాత్రులవుతారని ఫాదర్ కొమ్మారెడ్డి ఇన్నారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడారు. దేవుడు దయామయుడని, ప్రతి ఒక్కరూ విశ్వాసంతో పరిశుద్ధంగా జీవించాలని సూచించారు. పాడిపంటలు సమృద్ధిగా అందించి దీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఫాదర్ మ్యాథ్యూస్, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయి

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట: అచ్చంపేట సచివాలయం–1 పరిధిలో రూ.30కోట్లకు పైగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేసినట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట సచివాయంలో పరిధిలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంత మంది లబ్ధిదారులు కొన్ని సంక్షేమ పథకాలు అందలేదని చెప్పడంతో.. అధికారులను, సచివాలయ సిబ్బందిని అడిగి కారణాలు తెలుసుకున్నారు. విచారించి, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని సమాధానం ఇచ్చారు. సచివాలయం పరిధిలో 320 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, గృహాలు నిర్మించుకునేందుకు రూ.12.16 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పడమర బజారు, బీసీ కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు వేసి, సైడు కాలువలు నిర్మించినట్లు ఎమ్మెల్యే నంబూరు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ మంచి నీటి కుళాయి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ స్థాయి అభివృద్ధి గతంలో ఎన్నడైనా జరిగిందా అని స్థానికులను అడిగారు. మంచిచేసే వారికి మద్దతు పలకాలని, చెడు చేసేవారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ కంబాల వీరబాబు, అచ్చంపేట 1, 2, 3 ఎంపీటీసీలు గంగసాని బాబు, తెల్లమేకల నాగరాజు, షేక్ మొహిద్దీన్, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి చిన యల్లమందయ్య, మాజీ సర్పంచ్‌లు టీవీఎస్ మల్లికార్జునరావు, తుమ్మా చిన్నపరెడ్డి, సుంకర శ్రీనివాసరెడ్డి, తాళ్లచెరువు సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి, బీసీ సేన అధ్యక్షుడు షేక్ జాని, నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షుడు సాతర్ల శ్రీనివాసరావు, అచ్చంపేట టౌన్ పార్టీ కన్వీనర్ సమరం, ఆర్యవైశ్య నాయకులు అన్నవరపు శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు షేక్ కమల్ సైదా, ఉప సర్పంచ్ షేక్ జాని, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సుభాని, సందెపోగు పున్నారావు, చెన్నకేశవులు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రజకులకు సముచిత ప్రాధాన్యం

దుర్గి: వైఎస్సార్ సీపీ పాలనలో రజకులకు సముచిత స్థానం లభిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, ఏపీ రాష్ట్ర రజక సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు చెప్పారు. మండలంలోని కంచరగుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చేదోడు కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న రజకుల కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తూ బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. టీడీపీ హయాంలో 40 ఏళ్లు నిండిన రజకులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రజకులకు మేలు చేస్తోందని, సర్కారుకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘాల లీగల్ సెల్ అధ్యక్షుడు కంభంపాటి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు వినుకొండ పాపారావు, చట్టు సైదారావు, ఓడల నాగరాజు, కేతరు మధు, నాగెండ్ల లక్ష్మీనారాయణ, నర్సారావుపేట పార్లమెంట్ బీసీ ప్రతినిధి సభ్యులు వేముల పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి తపస్సుకాల ఉపవాస దీక్షలు

రెంటచింతల: లోక రక్షకుడైన ఏసుక్రీస్తు అంతిమ గడియలలో పడిన కష్టాలను స్మరించుకుంటూ చేపట్టనున్న 40 రోజుల ఉపవాస దీక్షలు ఈనెల 22 నుంచి ప్రారంభంకానున్నట్లు స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఏరువ లూర్థుమర్రెడ్డి చెప్పారు. సోమవారం ఫాదర్ లూర్థుమర్రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కానుకమాత చర్చిలో బుధవారం ఉదయం 5.30 గంటలకు దివ్య పూజా బలిని నిర్వహించి భక్తులకు తపస్సుకాలం ఆవశ్యకతను వివరించారు. దీక్ష తీసుకున్న భక్తుల నుదిటిన విబూదిని అద్ది, జపమాలను మెడలో వేసి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు చెప్పారు. పోప్ ఫ్రాన్సిస్ చెప్పిన 10 సూచనలు పఠించి సన్మార్గంలో నడిస్తే ఉత్తమ ఫలితాలను పొందుతారని పేర్కొన్నారు. దీక్ష తీసుకున్న వారు 40 రోజుల పాటు ఈ తపస్సుకాల ప్రార్థనలలో పాల్గొని సాయంత్రం ఏసుక్రీస్తు శిలువ ధ్యానం గుర్తుచేసుకుంటూ ఉంటారని వివరించారు.

నేటి నుంచి చామర్రులో ప్రతిష్ఠా మహోత్సవాలు

అచ్చంపేట: మండలంలోని చామర్రులో ఉన్న వరశిద్ది వినాయక, నాభిశిల, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, అభయాంజనేయ, పోలేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ 9వ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. చామర్రు రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. 21న ప్రారంభ క్రతువు, 22న లక్షదూర్వార్చన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకినాడ శ్రీపీఠం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానందస్వామి హాజరవుతారని వెల్లడించారు. 23న సిద్ధిబుద్ధి సమేత వరశిద్ది వినాయకుని కల్యాణ మహోత్సవం, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మోటారు బైక్ ర్యాలీ, వెంకటేశ్వర భక్తి గీతాలాపన, సంగీత కచ్చేరి, కోలాట ప్రదర్శనలు ఉంటాయన్నారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందచేస్తున్న జడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం కోసం జిల్లా పరిషత్ తరపున రూ.50లక్షలు కేటాయించినట్లు జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఆయన పౌష్టికాహారం పంపిణీ చేశారు. గతంలో ఒక్కొక్క విద్యార్థికి రోజుకు రూ.5లు మాత్రమే కేటాయించేవారని, ఈ ఏడాది నుంచి రూ.7.50లు చేసినట్లు చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, హెచ్‌ఎం పి.లక్ష్మీనారాయణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ మొగలి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దమ్మాలపాడులో 'ఫ్యామిలీ ఫిజీషియన్'



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సూర్యప్రకాశరావు

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): దమ్మాలపాడులో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో వైద్యులు ఎస్.సూర్యప్రకాశరావు, జయకృష్ణ పాల్గొని 127 మందికి వైద్యసేవలందించారు. బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శాంతకుమారి, సూపర్‌వైజర్లు పీటర్ డానియేల్, జోస్పిన్‌రాణి, ఏఎన్‌ఎం అన్నామణి, మార్తమ్మ, నీరజ, డీఈఓ రవితేజ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి

మాచర్ల: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని, అందుకే ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి చెప్పారు. సోమవారం పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో పల్నాడు జూనియర్ కళాశాల 21వ వార్షికోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ వేముల నాగయ్య, కళాశాల డైరెక్టర్లు పఠాన్ నాగూర్‌వలి, ప్రిన్సిపాల్ భాస్కర్, డైరెక్టర్లు నారాయణ, శాస్త్రి, మస్తాన్‌వలి, కాశి, అధ్యాపకులు జేవీకేఎస్ ప్రసాద్, లక్ష్మీనారాయణ, కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎదగాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గొట్టిముక్కల పవన్‌రెడ్డి

పిడుగురాళ్ల: గ్రామీణ స్థాయి క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎదగాలని వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ యువజన విభాగం నాయకుడు గొట్టిముక్కల పవన్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని స్కాలర్ డ్రిగీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కార్క్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ 9వ రోజున గొట్టిముక్కల పవన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టాస్ వేసి తొలి మ్యాచ్‌ని ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో ఎస్ఎస్ సీసీ, లగాన్ సీసీ జట్ల మధ్య పోటీ జరగ్గా ఎస్ఎస్ సీసీ గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో క్రేజీబాయ్స్, వివేకానంద సీసీ కొండమోడు జట్ల మధ్య పోటీ జరగ్గా క్రేజీబాయ్స్ జట్టు విజయం సాధించింది.

పీటీజీ పాఠశాలలో సామాజిక న్యాయ దినోత్సవం

విజయపురిసౌత్: సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పీటీజీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జడ్జి మధుబాబు మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు చట్టం, న్యాయ వ్యవస్థలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజంలో బాధ్యత గల పౌరుడిగా మెలగాలన్నారు. ప్రభుత్వ న్యాయవాది జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం పాఠశాలలోని వసతిగృహం, మౌలిక వసతులు, టాయిలెట్లను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.